క్లుప్తంగా

బుల్లయ్య కళాశాలలో అధ్యాపకులకు సెమినార్


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం వివిధ కళాశాలల అధ్యాపకులకు ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ) ఆధ్వర్యంలో ఒక్కరోజు సెమినార్ నిర్వహించారు. థియరీ, లేబరేటరీ కోర్సులు, వాటి ఫలితాలు, ప్రోగ్రాం ఫలితాల సాధన గణనపై సదస్సు జరిగింది. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.బాబు, రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ కె.రాజేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి 100 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


పరుగు పందెంలో పాల్గొన్న చిన్నారులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి కె.వి.రామారావు రిసోర్సు పర్సన్‌గా పాల్గొని విద్యార్థులతో ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివించారు. తమ జీవితంలో ఎన్నో కష్టాలకోర్చి, అవాంతరాలను అధిగమించి ఉన్నత స్థాయికి చేరుకున్న విజేతల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం చిన్నారులకు పరుగు పందెం నిర్వహించారు. చిన్నారులకు బిస్కెట్లు, చాక్‌లెట్‌లు అందించారు.

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న చల్లా రాంబాబు

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనం అలరించింది. ముఖ్య అతిథి చల్లా రాంబాబు మాట్లాడుతూ కవిత్వంలో ఒక భాగమే గజల్ అన్నారు. అక్షర తాండవం, అన్వేషణ, తీరని ఆవేదన, పదవిన్యాసం, ఉద్వేగం, ఆవేశం వంటి ఎన్నో విషయాల సమాహారమే కవిత్వమన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవిత్వం సార్వజనీనం, సర్వకాలాత్మికం అన్నారు. కవి దార్శనికుడు, తాత్వికుడు, ప్రవక్త అని పేర్కొన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొని, కవిత్వం చదివి వినిపించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, సీహెచ్.చినసూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.రాంప్రసాద్, సోమంచి వినయభూషణరావు, కేవీఎస్ మూర్తి, కొత్తూరి రమణ తదితరులు పాల్గొని కవితలు వినిపించారు.

ముగ్గురు హెడ్ నర్సులకు పదోన్నతి


ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ రాధారాణి

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టుల కోసం బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. హెడ్ నర్సులుగా పని చేస్తున్న ముగ్గురికి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతులు లభించాయి. డి.కవిత (రీజినల్ కంటి ఆస్పత్రి), జి.చంద్రిక (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి), ఎం.ఇందిర (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి)లకు పోస్టింగులు ఇస్తూ వైద్యారోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భవానీ పాల్గొన్నారు.

వెంకన్న తిరు కల్యాణోత్సవానికి అంకురార్పణ

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవానికి బుధవారం అంకురార్పణ జరిగింది. స్వామివారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనసేవ, నూతన వస్త్రాలంకరణ, స్వామి వారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. సాయంత్రం దేవస్థానం మండపంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు, వేదపండితులు ఉత్సవ సంకల్పం చేపట్టారు.


మురళీనగర్ గ్రంథాలయంలో పిల్లలకు కథ చెబుతున్న విద్యార్థిని


మహిళా గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న చిన్నారులు


వేసిన పెయింటింగ్స్ చూపుతున్న విద్యార్థులు

ఆడుతూ పాడుతూ.. వేసవి శిక్షణ

- మురళీనగర్‌లో సమ్మర్ క్యాంప్‌ల సందడి
- ఒకే చోట వినోదం, విజ్ఞానం, నైపుణ్యాల సాధన
- వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న బాలబాలికలు


వాకర్స్ పార్కులో ఫ్యాబ్రిక్ పెయింటింగ్స్ ప్రదర్శిస్తున్న బాలబాలికలు

మురళీనగర్: వేసవి రాగానే విద్యార్థులందరికీ కాస్త తీరిక సమయం దొరుకుతుంది. కనీసం 50 రోజులు పాఠశాలలకు సెలవులు ఉంటాయి. ఈ సెలవులను పిల్లలు వినియోగించుకుని తమ సామర్థ్యం, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతోపాటు సృజనాత్మకతకు పదును పెట్టుకునే సరైన సమయం ఇదే. ముఖ్యంగా విద్యార్థులు తమకు నచ్చిన కళలో ప్రవేశించడానికి, తర్ఫీదు పొందడానికి, ఇష్టమైన క్రీడలో రాణించడానికి వేసవి కాలం మంచి అవకాశాన్ని ఇస్తుంది. ఈ నేపథ్యంలో మురళీనగర్‌లోని అనేక సంస్థలు విద్యార్థులకు అనేక అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ముందుకొచ్చాయి. మరికొన్ని సంస్థలు స్వల్ప రుసుముతో శిక్షణ ఇస్తున్నాయి. చిన్నారులూ.. మరెందుకు ఆలస్యం!.. ఈ వేసవిలో ఎంచక్కా ఉచిత శిక్షణ శిబిరాల్లో చేరిపోండి.. ఆడుతూ.. పాడుతూ వినోదం, విజ్ఞానంతోపాటు వివిధ కళల్లో నైపుణ్యాలు పెంపొందించుకోండి.

మహిళలు, పిల్లల గ్రంథాలయంలో..
గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జూన్ 6 వరకు ఇవి కొనసాగుతాయి. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. పుస్తక పఠనానికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. నీతి కథలు చెప్పడం, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ క్రాఫ్టింగ్, వంటి కళల్లో ప్రవేశంతోపాటు డ్యాన్స్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్ ఆటలు, కప్ గేమ్, నిర్వహిస్తారు. నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లతో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయాధికారి వై.పద్మజను నేరుగా కలిసి విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..
మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వాకర్స్ పార్కులో విద్యార్థులకు ఆసక్తి కలిగిన అంశాల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. జూన్ 6 వరకు ఉచిత శిక్షణ కొనసాగుతుంది. ఆధునిక చిత్రలేఖనంలో భాగంగా ఫ్యాబ్రిక్, గ్లాస్, సీడీ, పాట్, శారీ పెయింటింగ్‌లపై శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా పార్కు కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావులను కలిసి పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలి.

వైశాఖి స్పోర్ట్స్ పార్కు ఆధ్వర్యంలో..
మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు ఆధ్వర్యంలో 6–12 ఏళ్ల వయసు గల చిన్నారులు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 31 వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు భగవద్గీత, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, నాట్యం, అబాకస్, యోగా స్కేటింగ్‌లో శిక్షణ ఇస్తారు. స్విమ్మింగ్‌లో ఉదయం 5–6, 6–7, 7–8 గంటలు, సాయంత్రం 4–5, 5–6, 6–7 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మహిళలకు సాయంత్రం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు మహిళా కోచ్ శిక్షణ అందిస్తారు. ఆసక్తి గల వారు 81976 49797 నంబర్‌లో సంప్రదించాలని పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పి.వి.సూర్యనారాయణరాజు కోరారు.

ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో..
మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ప్రశాంతి పార్కు, వనితా వాకర్స్ క్లబ్, వనమాలి సంస్థల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. స్టెయిన్ వుడ్ మ్యూరల్ ఆర్ట్, ఓహెచ్‌పీ షీట్ ఆర్ట్, టార్టోయిస్, గ్లాస్ పెయింటింగ్, 3డీ అవుట్ లైనర్ ఆర్ట్, వెజిటబుల్ పెయింటింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. 5 నుంచి 15 ఏళ్ల వయసు పిల్లలు శిక్షణలో చేరవచ్చు. వివరాలకు 94918 54838 నంబర్‌లో సంప్రదించాలి.


వాకర్స్ క్లబ్‌లో చిత్రలేఖనంలో నిమగ్నమైన చిన్నారులు



పిల్లలకు శిక్షణ ఇస్తున్న నిపుణురాలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మద్రిపాలెం: ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ పరిధి మాధవధార సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 11 కేవీ తెన్నేటినగర్, కళింగనగర్, సీతన్న గార్డెన్స్, లేన్సమ్ గ్రీన్స్ ఫీడర్ల పరిధిలోని కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, తెన్నేటినగర్, మాధవ స్వామి టెంపుల్ రోడ్డు, కళింగనగర్, ఎంఎన్ఆర్ పార్క్ రోడ్డు, తులరాం పార్లర్ జంక్షన్, వాటర్ ట్యాంక్ రోడ్డు, లేన్సమ్ గ్రీన్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఘనంగా వాసవీ మాత జయంతి


ధ్యానమందిరంలో జరిగిన కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవాసవి మాత ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 108 మంది మహిళలతో కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేయించారు. మధ్యాహ్నం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, షిర్డీ సాయిబాబా ధ్యానమందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.13.50 లక్షలు

అల్లిపురం: ఆశీలమెట్ట దరి సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయం రూ.13,50,693 సమకూరినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఈ మొత్తం 20 రోజులకుగాను లభించిందని పేర్కొన్నారు. అదే విధంగా 192 గ్రాముల 700 మిల్లీగ్రాముల వెండి, 19 యూఎస్ డాలర్లు, శ్రీలంక కరెన్సీ రూ.300 లభించాయన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ టీఆర్ బోస్, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ శాఖ తనిఖీ అధికారి కె.గాయత్రి, దేవాలయ సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, డీఎస్ ప్రసాద్, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

న్యాయ సలహాలపై అవగాహన


అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి సన్యాసినాయుడు

మద్రిపాలెం: న్యాయ సలహా కేంద్రాల ప్రాముఖ్యాన్ని ప్రజలకు వివరించే దిశగా అంగన్‌వాడీ కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు ఉచిత న్యాయ సలహాలపై ఆయన అవగాహన కల్పించారు. గృహహింస, వేధింపుల బారిన పడకుండా మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించే విధంగా తీసుకొచ్చిన చట్టాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం
కార్మికులంతా తమ హక్కుల సాధన కోసం కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సన్యాసినాయుడు సూచించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడానికి భారత ప్రభుత్వం ఈ శ్రమ్ యోజనను ప్రారంభించిదన్నారు. కార్మికులందరికీ ఈ శ్రమ్ కార్డులు ఉండాలని, వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్డులతో ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. సీడీపీవోలు ఎం.వి.రమణకుమారి, ఎం.శ్రీలత పర్యవేక్షించిన ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారి శారదాదేవి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేష్, పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం


బాలబాలికలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు


విద్యార్థులు తయారు చేసిన అందమైన కళాకృతులు

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని క్లబ్ పూర్వ అధ్యక్షుడు కేజీ కృష్ణారావు అన్నారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన బుధవారం వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణకు క్లబ్ సభ్యులు పూర్తి సహకారం అందించడం అభినందనీయమన్నారు. క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సనపల భానుప్రకాష్ మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న వేసవి శిబిరానికి విశేష స్పందన లభించిందని చెప్పారు. చిన్నారులకు వివిధ రకాల పెయింటింగ్‌లపై శిక్షణ ఇచ్చామన్నారు. పెయింటింగ్ శిక్షకురాలు భవాని విద్యార్థులు తయారు చేసిన వివిధ పెయింటింగ్ మోడళ్లను ప్రదర్శించారు. బాలబాలికలు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. సత్తి సునీల్ రెడ్డి, లలితారెడ్డి దంపతులు 40 నీతి కథల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, బాలచెన్నయ్య, ఎల్‌వీ సుధాకర్, యోగా మాస్టర్ మూర్తి పాల్గొన్నారు.

ఆసరా సేవలు విస్తృతం కావాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సొసైటీ సభ్యులు

దాబాగార్డెన్స్: ఆసరా చారిటబుల్ ట్రస్ట్ సొసైటీ సేవలు మరింత విస్తృతం చేయాలని సొసైటీ అధ్యక్షురాలు సునీత పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆసరా 11వ వార్షికోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ఆసరా ఆధ్వర్యంలో నడుస్తున్న 21 ట్యూషన్ కేంద్రాల సిబ్బందిని బహుమతులతో సత్కరించారు. ఇటీవల జరిగిన మినీ బాలోత్సవం పుస్తకం విడుదల చేశారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై పలు సూచనలు చేశారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైజాగ్ క్లబ్ వ్యవస్థాపకురాలు కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందివ్వడంలో వీసీసీ ముందుంటుందన్నారు. ఆసరా సభ్యులు శ్యామల, శోభ, సంజీవ్‌కుమార్, శ్రీనాథ్, శ్రీనివాసరావు, వైజాగ్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

- అల్లూరి అభిమానులు, విద్యార్థుల ప్రతిజ్ఞ
- వర్ధంతి వేళ విప్లవ వీరుడికి ఘన నివాళి


సీతమ్మధారలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

సీతంపేట: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడిపిన తిరుగుబాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైందని వక్తలు పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని సీతమ్మధారలోని అల్లూరి విగ్రహం వద్ద ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి వార్షిక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అల్లూరి అభిమానులు, విద్యార్థులు గుమిగూడి అల్లూరి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాన్య ప్రజల పక్షాన నిలబడిన అల్లూరి సమాజ ప్రధాన జీవన స్రవంతికి వెలుపల జీవించే గిరిజనులలో స్వాతంత్య్ర కాంక్షను రగిలించి, పోరాట యోధులుగా తయారు చేశారన్నారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, సభ్యులు కోలవెన్ను చాంద్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావు, జి.ఎస్.ఎన్.రాజు, పి.వి.రమణ, సిహెచ్.ప్రమీల, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సార్ నగర్‌లో..
తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లో మన్యం వీరుడు అల్లూరి 101వ వర్ధంతిని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు సాగించిన పోరాట క్రమాన్ని వివరించారు. సాయుధ పోరాటం ద్వారానే దేశ ప్రజల విముక్తి సాధ్యమని సీతారామరాజు భావించి, కేవలం 27ఏళ్ల ప్రాయంలోనే తన ప్రాణాలను అర్పించారని తెలిపారు. ప్రస్తుత పాలకవర్గాలు రాజ్యాంగాన్ని, చట్టాలను పక్కన పెట్టి ఆదివాసీల హక్కులపై దాడులు చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలందరినీ అటవీప్రాంతం నుంచి తొలగించే కుట్రకు పూనుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అరుణోదయ కళాకారులు 'తెలుగువీర లేవరా.. దీక్షబూని సాగరా' అంటూ అల్లూరిని ఉద్దేశించి పాడిన పాట ప్రేక్షకులను ఉత్తేజపరిచింది. ఏరియా కమిటీ నాయకురాలు ఎస్. వెంకటలక్ష్మి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అల్లూరికి ఘన నివాళులర్పించారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

దాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన మే 20 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసి యాజమాన్యాలకు లాభం చేకూర్చే విధంగా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఏపీ ఎఫ్‌టీయూ నాయకుడు దేవా, ఏసీటీయూ నాయకుడు కె. శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ చండేశ్వర పునఃప్రతిష్ఠాపన


రామలింగేశ్వరాయంలో నిర్వహిస్తున్న హోమం

సీతంపేట: అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లోని శ్రీరామలింగేశ్వరాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో త్రిదిన దీక్షా పూర్వక ధ్వజ చండేశ్వర పునఃప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరుగుతోంది. దీనిలో భాగంగా మూడు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం గవ్యాంత పూజలు, నిత్యారాధన పూర్వక పాత్ర రాపాసన, జప పారాయణాలు, వాస్తుపూజ, బలి హోమ, పూర్ణాహుతి, గ్రామ ప్రదక్షిణ, పంచ శయ్యాధివాసం, మండపార్చన, కళాన్యాస హోమాలు, పంచసూక్త బీజాక్షర హోమాలు చేపట్టారు. అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ అర్చకుల పర్యవేక్షణలో పూజలు జరుగుతున్నాయి. గురువారం పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని, మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

హామీలు అమలు చేయాలని ఆటోడ్రైవర్ల ఆందోళన


సరస్వతీ పార్కు వద్ద నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

జగదాంబ: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. బుధవారం సరస్వతీ పార్కు వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డ్రైవర్లకు వాహనమిత్ర ద్వారా రూ. 15 ఇవ్వాలన్నారు. 21, 31 జీవో రద్దు చేయాలన్నారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 20న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీనివాస్, జోగారావు, పెద్దమూర్తి, నూకప్పారావు, సూరిబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.